క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



పాస్టర్‌ను సన్మానిస్తున్న ఐక్యవేదిక బాధ్యులు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన పాస్టర్ మంద తిమోతీని ఖమ్మం జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ ఐక్యవేదిక ఆధ్వర్యాన సన్మానించారు. ఖమ్మంలో బుధవారం జరిగిన కృష్ణ సారాధన మహోత్సవంలో ఆయనను సన్మానించాక పలువురు మాట్లాడారు. ఎందరో పేద విద్యార్థుల చదువుకు చేయూత నిస్తున్న తిమోతీ చర్చిల నిర్మాణానికి కృషి చేయడంతో విలియం కేరీ అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈసమావేశంలో చెన్నారావు, వేమన సత్యం, పాలు, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

కావ్య ఆస్పత్రికి అవార్డు



అవార్డుతో డాక్టర్ కావ్యచంద్

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని కావ్య ఆస్పత్రికి తెలంగాణ బిజినెస్ అవార్డు–2023 వరించింది. వైద్య రంగంలో ఎండోక్రినాలజీ, మధుమోహం, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ విభాగాల్లో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలకు గాను ఈ అవార్డు లభించినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన అవార్డు వేడుకల్లో ఆస్పత్రి సీఈఓ డాక్టర్ యలముడి కావ్యచంద్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ రవీందర్, ప్రసూన పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆల్ ఇండియా పంచాయతీ పరిషత్ జిల్లా చైర్మన్‌గా నగరానికి చెందిన ఎంఏ.సమద్ నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఆల్ ఇండియా పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ధ్యాన్‌పాల్‌సింగ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సమద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలపగా.. పలువురు అభినందించారు.

డీసీసీబీ సీఈఓకు శుభాకాంక్షలు



రెహమాన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అబీద్ ఉర్ రెహమాన్‌ను బ్యాంక్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో పాటు బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు వేర్వేరుగా బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం నాగేందర్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రామస్వామి, కార్యదర్శి రామకృష్ణ, ప్రతినిధులు సీహెచ్.ఓం ప్రకాశ్, ఉపేంద్రయ్య, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి

కామేపల్లి: ప్రతీ కుటుంబానికి బీమా ఆర్థిక భద్రత ఇస్తుందని కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల లక్ష్మీబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా రూ.3.36 లక్షల చెక్కు మంజూరు కాగా బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధిత నామినికి చెక్కును అందించారు. అలాగే వాహనాలకు కూడా తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ టైడ్ చానల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జోనల్ మేనేజర్ కుంచాల చిరంజీవి, జిల్లా మేనేజర్ పిన్ని సురేశ్, రాంబాబు, రాయల భిక్షమయ్య పలువురు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ఉద్యోగాలు

ఖమ్మం సహకారనగర్: హైకీ కన్సల్టెన్సీ నియామకాలలో తమ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి మాట్లాడగా.. అకాడమిక్ డైరెక్టర్లు గందం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బింధాజ్, టీపీఓ సవిత తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పార్కింగ్..

ఖమ్మం రైల్వే స్టేషన్ స్టాండ్‌లో నిర్వాహకుల దోపిడీ

- అసలే అధిక ధర.. ఆపై ఇష్టానుసారంగా వసూళ్లు
- వాహనం పార్క్ చేయాలంటే జంకుతున్న జనం
- నిర్వాహకులు, వాహనదారులకు మధ్య తరచూ వాగ్వాదాలు
- పట్టించుకోని రైల్వే శాఖాధికారులు



ఖమ్మం రైల్వే స్టేషన్‌లో వాహనాల పార్కింగ్ స్టాండ్

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు సుఖదేవ్. ఇతడు బుధవారం ఉదయం 11.56 గంటలకు తన మిత్రుడిని రైలు ఎక్కించేందుకు స్టేషన్‌కు వచ్చాడు. ఖాళీ స్థలంలో బండి పెడుతుండగా పార్కింగ్ నిర్వాహకులు అడ్డుకుని పార్కింగ్ ఫీజు చెల్లించాలన్నారు. రైలు ఎక్కించడానికి వచ్చాను, ఐదు నిమిషాల్లో సామన్లు లోపల పెట్టి వస్తానని చెప్పినా వినకపోవడంతో.. తప్పని పరిస్థితిలో రూ.20లు నగదు చెల్లించాడు. కానీ రైల్వే శాఖ నిబంధనల ప్రకారం.. గంట, గంటలోపు వాహనాన్ని పార్క్ చేస్తే రూ.10 మాత్రమే చెల్లించాలి.



ఖమ్మంమయూరిసెంటర్: చారాణా దావత్‌కు.. బారాణా తాంగాఅన్న చందంగా ఖమ్మం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ స్టాండ్‌లో ఫీజులు ఉన్నాయి. రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని పార్కింగ్ ప్రాంతంలో ఫీజులు చూస్తే రైలులో ప్రయాణించేందుకు టికెట్ ధరకు అయే ఖర్చు కన్నా.. పార్కింగ్‌లో బండి పెట్టడానికి అయ్యే ఖర్చే అధికంగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనం పార్కింగ్ చేస్తే రూ.100లకు పైగా వసూలు చేస్తున్నారని, అదే రోజంతా ఉంచితే రూ.250 వరకు కట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. ఖమ్మం నుంచి రైలు మార్గాన వరంగల్, హైదరాబాద్, మధిర, విజయవాడ వంటి ప్రాంతాలకు వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తుంటారు. అయితే అందులో చాలా మంది ఉపాధి పనులు, ఇతర అవసరాల కోసం రైల్వే స్టేషన్‌లో తమ వాహనాలను పార్క్ చేసి రైలులో ఖమ్మం నుంచి వెళ్లి వస్తుంటారు.

ఇష్టానుసారంగా వసూళ్లు..

ఖమ్మం రైల్వే స్టేషన్‌లో వాహనాల పార్కింగ్ ప్రాంత నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. అందినకాడికి దోచుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. బంధువులను రైలు ఎక్కించేందుకు వచ్చి బండి పక్కన పెట్టినా.. ఐదు నిమిషాలకు రూ.20లను వసూలు చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఇక్కడ నుంచి బండి తీయండని బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. ఐదు నిమిషాలకు పార్కింగ్ ఫీజు వసూలు ఉండదని అధికారులు చెప్తున్నా.. వాహనదారుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే వాహనాల ప్లగ్‌లు తీయడం, టైర్లలో గాలి తీయడం వంటివి చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రైల్వే స్టేషన్‌లోని పోస్టాఫీస్ సిబ్బంది కార్యాలయం ఎదురుగా పార్క్ చేసిన వారి వాహనాల టైర్లలో గాలి తీశారని అక్కడి సిబ్బంది ఆరోపిస్తున్నారు.



మిత్రుడిని దింపేందుకు వచ్చిన సుఖదేవ్ నుంచి ఫీజు వసూలు చేస్తున్న నిర్వాహకుడు

తరచూ వాగ్వాదాలు..

రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంత నిర్వాహకులకు, స్టేషన్‌కు వచ్చే వాహనదారులకు మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. వాహనాలకు ఫీజులు అధికంగా వసూలు చేయడమే కాక.. సమాధానం సక్రమంగా చెప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట వాహనం పార్కింగ్ చేస్తే ఆరు గంటలకు రూ.10, ఒక రోజుకు(24 గంటలకు) రూ.40లు తీసుకుంటున్నారని, రైల్వే స్టేషన్‌లో మాత్రం రెట్టింపు స్థాయిలో వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.

ఇంత ధర ఎక్కడా లేదు..



ఖమ్మం రైల్వే స్టేషన్‌లో వాహనాల ఘోరంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బైక్ పార్క్ చేస్తే రూ.100కు పైగా వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారు. పక్కన పార్క్ చేసి ఐదు నిమిషాలు లోపలకు వెళ్లి వచ్చే సరికి టైర్లలో గాలి తీస్తున్నారు. నిర్వాహకులపై చర్యలు తీసుకునేవారు లేరు.

– శ్రీనివాసరావు, ప్రయాణికుడు

టికెట్ ధర కంటే అధికం..



శుక్రవారం రాత్రి ఖమ్మం రైల్వే స్టేషన్‌లో వాహనాన్ని పార్క్ చేసి వెళ్లి ఆదివారం రాత్రికి తిరిగి వచ్చాను. రెండు రోజులకు నా వద్ద రూ.540లు వసూలు చేశారు. ఇంత ధర ఏంటని ప్రశ్నిస్తే.. ఇక్కడ ఫీజు ఇంతే ఉంటుందని దబాయిస్తున్నారు. నేను కొన్న టికెట్ ధర కన్నా పార్కింగ్ ఫీజే ఎక్కువగా ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

– కె.లక్ష్మీనరసింహారావు, ఖమ్మం

చర్యలు తీసుకుంటాం..



ఖమ్మం రైల్వే స్టేషన్‌లోని పార్కింగ్ ప్రాంతంలో వాహనాల పార్కింగ్‌కు శాఖ ధరలు నిర్ణయించింది. అలా కాకుండా ఎవరైనా అధిక ఫీజులు వసూలు చేసినట్లు తెలిసినా, ఎవరైనా స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ జాఫర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, ఖమ్మం రైల్వే స్టేషన్

కేటగిరీల వారీగా ధరలు..

రైల్వే శాఖ రైల్వే స్టేషన్లను ఎన్ఎస్‌జీ–1, 2, 3, 4, 5, 6 కేటగిరీలుగా విభజించి వాహనాల పార్కింగ్ ధరలను నిర్దేశించింది. ఈనేపథ్యాన ఖమ్మం రైల్వే స్టేషన్‌ను ఎన్ఎస్‌జీ–3 కింద కేటాయించి రెండు గంటల పార్కింగ్‌కు మోటార్ సైకిల్‌కు రూ.15, కారుకు రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మోటార సైకిల్కు ఒక రోజుకు రూ.230లను జీఎస్టీతో కలిపి నిర్దేశించింది. అయితే ఖమ్మంలోని పార్కింగ్ నిర్వాహకులు మాత్రం అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్నఏఆర్ అండ్ సివిల్ సిబ్బంది

కామేపల్లి/ఖమ్మంక్రైం: సాతానిగూడెం గ్రామానికి చెందిన 2003 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుల్ తలారి బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాబు తల్లి సుగుణమ్మ ఆర్థిక పరిస్థితి సరిగాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని తెలుసుకున్న 2003 బ్యాచ్ ఏఆర్ అండ్ సివిల్ సిబ్బంది రూ.లక్షన్నర ఆర్థిక సాయాన్ని ఆమెకు బుధవారం అందజేశారు.

పద్మశాలి కుటుంబీకులకు..

ఖమ్మం మామిళ్లగూడెం: నిరుపేద పద్మశాలి కుటుంబాలైన అగ్రహారం కాలనీకి చెందిన పొట్టబత్తిని కృష్ణ, గోళ్లపాడు గ్రామానికి చెందిన మలమద్ది ఈశ్వరమ్మలు ఇటీవల మృతిచెందగా.. మంగళవారం వారి కుటుంబాలకు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యాన సంఘ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస్‌బాబు, పెండెం జనార్దన్, రిటైర్డు ఉద్యోగ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, కొండల్‌రావు, ఉద్యోగ విభాగం ప్రధాన కార్యదర్శి మధు, యూత్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సంపత్‌కుమార్, పి.సత్యనారాయణ, పి.వెంకటేశ్వర్లు, చీదిరాల భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ పుస్తకాల పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్‌వైఎస్ఆర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ లకావత్ సైదులు బుధవారం అకడమిక్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనేది భవిష్యత్‌ను దిశానిర్దేశం చేస్తున్నందున ఉపాధ్యాయులు అంకిత భావంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రంగారావు, ఉపాధ్యాయులు నవీన్, శేషు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు తగవు..

ఖమ్మంవన్‌టౌన్: ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ.. సంక్షేమాన్ని ప్రజలకు అందుబాటులో తెచ్చేవిధంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలంతా విమర్శలు చేయడం తగదని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావులు అన్నారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పినా.. వారి తీరు మారడంలేదన్నారు. పోటీలో గెలుపు, ఓటములు సహజమేనని అవసరమైతే ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్పా... శాపనార్థాలు పెట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికితీసి ప్రభుత్వ సంస్థలను ప్రక్షాళన చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పై నమ్మకం ఉండి అత్యధిక మెజార్టీ ఇచ్చారని, ఈ ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కార్యాచరణ ప్రారంభించారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం కూలిపోతుంది అని మాట్లాడకుండా ప్రజల సంక్షేమానికి కలిసి రావాలని చెప్పారు.



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తదితరులు

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, సర్పంచ్



ప్రతిభ చూపిన విద్యార్థులతో హార్వెస్ట్ యాజమాన్యం

రఘునాథపాలెం/ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రఘునాథపాలెం మండలంలోని కోయచలక పాఠశాల విద్యార్థిని ఎస్‌కే ఖాసీంబీ ఎంపికైంది. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆమె జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం శిరీష తెలిపారు. బుధవారం పాఠశాలలో ఖాసీంబీని హెచ్ఎంతోపాటు సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరమణ, పీఈటీ ముసీద్, భిక్షమయ్య, తోట వెంకట్ అభినందించారు. అలాగే, అండర్–19 విభాగం 100, 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ జాతీయ స్థాయి పోటీలకు హార్వెస్ట్ కళాశాల విద్యార్థిని బి.వైశాలి ఎంపిక కాగా, అండర్–17 క్రికెట్‌లో బి.శ్రీజన్ ఎంపికయ్యాడు. కాగా, రాష్ట్రస్థాయిలో జరిగిన పలు పోటీల్లో కళాశాలకు చెందిన ఉజ్వల్, చార్వి, శరణ్య, విష్ణుతేజ, రఘురామ్, అక్షయ, ఉజ్వల్, అయాన్, కార్తికేయ, అక్షయిని, హ్యాన్సి, నక్షత్ర, దీక్షిత, సమన్ర, గ్రీష్మ, భవిత, కౌశిక్, రుత్విక్, జస్వంత్, కమలిక, దివిజ, నాగకౌశిక్, రంజిత్, రిషిర, లోకేష్, దివాకర్, జోషిత, ఐశాని, జాన్వీరెడ్డి, తియా ప్రతిభ చూపారని కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లకు మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నగరంలోని మైసమ్మగుడి ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, వీవీపాలెం నగర ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీంతో ఫీడర్ల పరిధిలోని మమత ఆస్పత్రిరోడ్డు, వరదయ్యనగర్, వీవీపాలెం గ్రామాల పరిధిలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప..

నేలకొండపల్లి/రఘునాథపాలెం: నేలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీవాసవి భవన్‌లో అయ్యప్ప మాలధారుల ఇరుముడి, రఘునాథపాలెం మండలం మంచుకొండలో అయ్యప్ప మాలధారుల మహాపడిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం భక్తులు ఆటా, పాటలతో సందడి చేశాక.. దేవరశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన నేలకొండపల్లి నుంచి శబరిమల సన్నిధానంకు బయలుదేరారు. అలాగే కొనకంచి వెంకటేశ్వర్లు, సురేశ్, రవి ఆధ్వర్యాన పూజా కార్యక్రమాలు నిర్వహించాక మాలధారులకు భిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో దిరిశాల నరేశ్, రాకేశ్,రాజేశ్, రాహుల్, నాయకులు బోయిన వేణు, జెర్రిపోతుల అంజిని, కాసాని సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మహాపడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు

నేడు కొత్త చాంబర్‌లోకి మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌లో గురువారం నుంచి విధులు నిర్వర్తించనున్నారు. ఈసందర్భంగా ఆయన చాంబర్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి పొంగులేటికి అభినందనలు



శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జీపీఆర్ ట్రస్ట్ చైర్మన్, తదితరులు

రఘునాథపాలెం: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జీపీఆర్ ట్రస్ట్ చైర్మన్ గుర్రం సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కనకయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కామేపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవండ్ల రామకృష్ణ, గుండ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు ఐఎఫ్‌టీయూకి ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: చెన్నై నగరంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) అఖిల భారత మహాసభలకు హాజరు కావాల్సిందిగా ఆ సంఘ ప్రతినిధులు రాష్ట్రంలో ట్రేడ్ యూనియన్‌గా ఉన్న ఐఎఫ్‌టీయూకి ఆహ్వానం పంపినట్లు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు తెలంగాణ నుంచి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణ, కె.సూర్యం, ఉపాధ్యక్షుడు ఎస్ఎల్ పద్మ, ఎం.నరేందర్, ఎం.హన్మేశ్, కార్యదర్శులు కె.రాజన్న, జి.రామయ్య, సి.వెంకటేశ్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని అన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఎన్నో ప్రయాసలకు ఓర్చి సాగు చేసిన మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలు చేతికొచ్చే దశలో ఈ తుపాన్ రైతులను దెబ్బతీసిందన్నారు. గత ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు చేయకపోవడంతో రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసిందని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దీని గురించి ఆలోచించి బీమా పథకం అమలు చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, కేశోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

నేలకొండపల్లి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఆటల పోటీలను విజయవంతం చేయాలని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య కోరారు. దినోత్సవం గురించి జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమాధికారిని బుధవారం జిల్లా కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో భాగం గారన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రో, క్యారమ్స్, వీల్‌చైర్, ట్రై సైకిల్ రేస్ వంటివి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమాధికారితో మాట్లాడుతున్న నాయకులు

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె..



నేలకొండపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



కామేపల్లి: వంటావార్పులో పాల్గొన్న ఉద్యోగులు

నేలకొండపల్లి/కూసుమంచి: గ్రామీణ తపాలా శాఖ తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని సంఘం పాలేరు డివిజన్ నాయకుడు కణతాల గోవిందరావు అన్నారు. సమ్మెలో భాగంగా బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే పాలేరులోని తపాలా కార్యాలయం ఎదుట కూసుమంచిలోని తపాల ఉద్యోగులు వంటావార్పు చేపట్టారు. ప్రభుత్వం యస్మా లాంటి చట్టాలను తమపై ఉపయోగించి అరెస్ట్ చేస్తే వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎనిమిది గంటల పని, పెన్షన్లతో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, కొత్తగా నియమించిన జీడీఎస్‌లకు ఐదు గంటల పనికి సెకండ్ టీఆర్‌సీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీడీఎస్‌ల సమ్మెలో చేరిన ఎన్ఎఫ్‌పీఈ సంఘం

ఖమ్మంగాంధీచౌక్: న్యాయమైన సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్)లు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో గురువారం నుంచి భాగస్వాములవుతున్నట్లు జీడీఎస్ ఎన్ఎఫ్‌పీఈ సంఘం ప్రకటించింది. ఎన్‌యూజీడీఎస్, ఏఐజీడీఎస్‌యూలు జీడీఎస్ పీ జేఏసీగా ఏర్పడి మంగళవారం నుంచి దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మెను ప్రారంభించింది. ఈ జేఏసీకి దూరంగా ఉన్న ఎన్ఎఫ్‌పీఈ గురువారం నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు సంఘం ప్రతినిధులు ప్రకటించింది. ఈ మేరకు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్ శ్రీనివాస్ ఖమ్మంలో ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జీడీఎస్‌ల సమ్మెలో ఎన్ఎఫ్‌పీఈ సంఘ ప్రతినిధులు, సభ్యులు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పే రివిజన్‌పై కమలేశ్ చంద్ర సిఫారసులను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని, సర్వీసుల ఆధారంగా ఇంక్రిమెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.